
క్లుప్తంగా

విత్తనశుద్ధి తప్పనిసరి

నింద్ర: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ పంటలపై గురువారం మండల కేంద్రంలోని ఏఓ మురళీకృష్ణ అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ, సజ్జలు వంటి పంటలు సాగు చేసే రైతులు కచ్చితంగా విత్తనశుద్ధి ఎంతో అవసరమన్నారు. విత్తనశుద్ధి చేయడం వల్ల నారుమడులు సమర్థవంతంగా తయారు అవుతుందని, అదేవిధంగా పంట వేరుశనగ పంట చక్కగా మొలక వస్తుందన్నారు. అలాగే నేలలోని క్రిమి కీటకాల బారి నుంచి తట్టుకోగలదన్నారు. అనంతరం సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గంగమ్మ పొంగళ్లు


అలంకరణలో గంగమ్మ అమ్మవారు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు పంచాయతీ పరిధిలోని మిట్టూరు గ్రామంలో గురువారం గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా, పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో అమ్మవారి ప్రతిమలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

వడమాలపేట : పాడి రైతులకు సబ్సిడీ ద్వారా సంపూర్ణ దాణా (టీఎంఆర్ ఫీడ్) రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని పశువైద్యాధికారి మునీధర్‌రెడ్డి తెలిపారు. ఈ దాణా పశువులకు పెట్టడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పశువులలో పునరుత్పత్తి పెరుగుతుందని తెలిపారు. మండలంలోని పాడి రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేజీ దాణా రూ.15.80 కాగా సబ్సిడీ రూ.9.30 పోగా కేవలం రూ.6.50కే పొందవచ్చన్నారు. ఒక్కో రైతుకు 25 బస్తాలు 200 కేజీల దాకా పంపిణీ చేస్తామని తెలిపారు. కావలసిన రైతులు ఆన్‌లైన్‌లో 200 కేజీల దాణా రూ.1300 చెల్లించాలని తీసుకెళ్లాలని కోరారు. టీఎంఆర్ ఫీడ్ రైతు భరోసా కేంద్రాల్లో పశుసంవర్ధక శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు లైవ్ స్టాక్ ఆఫీసర్ లోకనాథం, 9866708002 నంబరులో సంప్రదించాలని కోరారు.

గజేంద్రుడి సేవలు మరువలేం


నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఉద్యోగ ధర్మం పాటించడంలో, విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గజేంద్రుడు సేవలు మరువలేనివని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. రిటైర్డ్ సీనియర్ లైన్‌మెన్, 1104 యూనియన్ నాయకుడు గజేంద్రుడు మృతి విషయం తెలిసి వారికి ఇంటికి వెళ్లి గజేంద్రుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. స్థలం చూపలేదు

చిత్తూరు రూరల్: జీడీనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాశీపల్లె పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి..స్థలం చూపలేదని ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షులు రెహమాన్ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఇళ్ల పట్టాలిచ్చినా స్థలాలు చూపకపోవడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారికి స్థలాలు ఇప్పించాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో మురుగేష్ (60) అనే రైతు అనారోగ్యంతో ఆకస్మికంగా మృతిచెందాడు. ఈ విషయం తెలిసి మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి గురువారం రైతు ఇంటికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద ఉంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

నేడు కోటాగరంలో గడప గడపకు..

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : మండల పరిధిలోని కోటాగరం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎట్టేరి గ్రామంలో ఉదయం 7.30 గంటలకే ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పాల్గొని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మమేకమవుతారన్నారు. అలాగే గ్రామంలోని సమస్యలపై ఆరా తీసి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

విద్యతోనే సంపద సృష్టిద్దాం

- పేదలకు ఉన్నతవిద్య, వైద్యానికి పెద్దపీట
- ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఉద్ఘాటన


టెన్త్‌లో మండల టాపర్ తరుణీకు బహుమతి అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: విద్యతోనే సంపదను సృష్టించాలి.. ప్రతి పేదవాడికి ఉన్నత విద్యతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నాడని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల్లో డిగ్రీ కళాశాలకు నిధులు మంజూరు చేసి శాశ్వత భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని డిప్యూటీ సీఎం అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఐటీ పరిశ్రమతో పాటు అంతర్జాతీయ స్థాయి పాఠశాల ఏర్పాటుతో పాటు అన్ని రంగాల్లోనూ ఈప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు లబ్ధిని సీఎం జగనన్న అందిస్తున్నారని చెప్పారు. అనంతరం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ప్రజల కోసం సేవలందించిన వైఎస్సార్, సీఎం జగనన్నను మరచిపోకూడదన్నారు. నియోజకవర్గంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధిని కల్పించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్టీసీ వైస్ చైర్మన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నిరంతరం ఈప్రాంత అభివృద్ధి కోసం పని చేస్తున్నారని చెప్పారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన దాతలను ఘనంగా సత్కరించారు. దాతలందరికీ 7 సెంట్లు చొప్పున ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించేందుకు అధికారులతో మాట్లాడతానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, డిగ్రీ కళాశాల చైర్మన్ బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు శిల్ప, ద్రాక్షాయణి, గోవిందయ్య, ఎంపీటీసీలు మునిచంద్రారెడ్డి, గుణశేఖర్, పుష్ప, యశోద, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, యువజన విభాగం కన్వీనర్ నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తం, ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి, నాయకులు పేట ధనంజయరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, బొజ్జారెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు..

టెన్త్ పరీక్షల్లో 500 మార్కులు పైచిలుకు సాధించిన విద్యార్థులకు మండలంలోని 9 స్కూళ్లలో 27 మంది విద్యార్థులకు వావిలచేను గ్రామానికి చెందిన పందికుంట నరసింహారెడ్డి రూ.1500 విలువ చేసే ప్రోత్సాహక బహుమతులను మంత్రి నారాయణ స్వామి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా మండలంలో టాపర్‌గా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నరసింహారెడ్డి(వావిలచేను), తులసీ రెడ్డి(అగ్గిచేనుపల్లె), కృష్ణారెడ్డి(కొమరగుంట) ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు విలువ చేసే ల్యాప్‌ట్యాప్‌లు అందించారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లెకు చెందిన హిమాచల్‌రెడ్డి ముగ్గురు టాపర్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతుల కింద రూ.5,116, రూ.3,116, రూ.2,116 నగదును అందజేశారు.

రైతులకు ప్రభుత్వ సదుపాయాలు అందాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ సౌభాగ్యలక్ష్మి

నగరి : ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను రైతులకు అందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆరు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రైతు భరోసా సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, పొలంబడి, మట్టి పరీక్ష, ఈ క్రాప్, కౌలు రైతులకు కార్డులు, స్పందన, డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవా మొదలైన కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. పథకాలకు అర్హులైన రైతులకు వాటిని అందించడంలో సిబ్బంది చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రాఘవేంద్ర యాదవ్, మురళీకృష్ణ, రజిని, వందన, యామిని(టీఏ), డిల్లీబాబు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం ఉన్న పిల్లల గుర్తింపు


గుండ్రాజుకుప్పం దళితవాడలో పిల్లల బరువు లెక్కిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నగరి : పోషకాహార లోపం ఉన్న పిల్లల గృహాలను ఐసీడీఎస్ సిబ్బంది గురువారం సందర్శించారు. ఇళ్లకు వెళ్లి పిల్లల బరువును తూచి అందుకు అనుగుణంగా వారి పోషకాహార లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణవేణి సమతుల ఆహార ప్రాముఖ్యతను గురించి బిడ్డల తల్లులకు అవగాహన కల్పిస్తూ, పోషకాహార లోపం నుంచి బయట పడడానికి తీసుకోవలసిన సూచనలు, సలహాలను ఇచ్చారు. తీవ్ర లోపం ఉన్న పిల్లలను తిరుపతిలోని పౌష్టికాహార పునరావాస కేంద్రంలో చేర్పించి చిన్నపిల్లల డాక్టర్ పర్యవేక్షణలో ఉంచడం జరుగుతుందన్నారు. పిల్లలకు ఆహార పదార్థాలను ఎంత పరిమాణంలో ఎన్నిసార్లు ఇవ్వాలి ? బిడ్డతో పాటు తల్లికి 3 రోజుల నుంచి 3 నెలల వరకు ఏ ఆహారం ఇవ్వాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం 5 ఏళ్లలోపు పిల్లలకు దగ్గరలోని సచివాలయంలో నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకమ్మకు నివాళులు


అంకమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య తల్లి ఎం.అంకమ్మ(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి అంకమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు మురగయ్యను ఓదార్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మురగయ్య కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేజేలు రెడ్డి అంకమ్మకు నివాళులు అర్పించారు.

31 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 31న బుధవారం నుంచి జూన్ 8 గురువారం వరకు వైభవంగా నిర్వహించడానికి అందరూ సమష్టి కృషి చేయాలని జేఈఓ వీరబ్రహ్మం ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆయన ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పోస్టర్లను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో జూన్ 4న గరుడ వాహనం, 7న రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తామని, ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

గజరాజుపై వేణుగోపాలుడు




హనుమంత వాహనంపై వేణుగోపాలుడి చిద్విలాసం, గజవాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు, ఆస్థానం నిర్వహిస్తున్న వేదపండితులు

- అట్టహాసంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు
- భక్తులను కటాక్షిస్తున్న స్వామివారు

కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు గురువారం రాత్రి స్వామివారు గజవాహనంపై, ఉదయం హనుమంత వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణ, మంగళవాయిద్యాలు అలరించాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి వైఖానస ఆగమ శాస్త్రోకంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు హనుమంతవాహనంపై కొలువుదీరిన స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం 3గంటల నుంచి వేదపండితులు ఆలయంలో వేదమంత్రాలతో వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించి పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం స్వామి వారర్లను మాడవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు.

అలాగే సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల నడుమ పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో స్వామి, అమ్మవారిని సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపానికి వేంచేపు చేసి వేద పండితులు ఊంజల్ సేవ నిర్వహించారు.

అలరించిన సంగీత కచేరీ..

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఆకట్టుకుంది. పలు భక్తి గీతాలను ఆలపించి స్వామి వారిని పరవశింపజేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లిన స్వామివారికి భక్తులు ఇంటింటా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.45 గంటలకు వేదపండితులు స్వామివారిని ఏకాంతసేవలో పవళింపజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు శుక్రవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

‘చిదా’ యాజమాన్యంపై చర్యలు చేపట్టండి


మిల్లు వద్ద ఫిర్యాదు కాపీలను చేతపట్టి ధర్నా చేస్తున్న కార్మిక నేతలు

- డీసీఎల్‌కు కార్మిక సంఘం నేతల ఫిర్యాదు
- ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పడుతోందని, సదరు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘ నాయకులు గురువారం మిల్లు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (డీసీఎల్)కు వేరువేరుగా ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మిల్లును అర్ధాంతరంగా మూసివేయడం అన్యాయం అన్నారు. 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి తమ పబ్బం గడుపుకోవాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా కొంతమంది కార్మికులకు నిబంధనలకు విరుద్ధంగా చెక్కులు, నగదు పంపిణీకి సిద్ధ పడినట్లు ఆరోపించారు. దీన్ని డీసీఎల్ అడ్డుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ప్రతి కార్మికుడికి పూర్తి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో ఒక్కో కార్మికుడికి రూ.10 లక్షల నగదును చెల్లించాలని డిమాండ్ చేశారు. 2023 మే 8వ తేదీన తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో చిదా స్పిన్నింగ్ మిల్లుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు రాజేంద్ర, కాటయ్య, సీఐటీయూ యూనియన్ నాయకులు బాబు, రవిచంద్ర, రామ్మూర్తి, రత్నం, గోవిందరాజులు, టీఎన్‌టీయూసీ నాయకులు ఏలుమలైరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య


సింహరాజుపురంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

పాలసముద్రం: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. గురువారం బలిజకండ్రిగ, పాలసముద్రం, ఆముదాల గ్రామాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. అధ్యాపకురాలు సునీత మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల్లో కంటే కూడా మెరుగ్గా ప్రభుత్వ కళాశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో చదువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు చాలావరకు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివిస్తున్నారని తెలిపారు. అందుకే ప్రైవేటు కళాశాలల్లో చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులకు మౌలిక వసతులు, ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి


సీఎండీ సంతోష్‌రావుకు శాలువతో సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి జిల్లా విద్యుత్‌శాఖ సీఎండీ కె.సంతోష్‌రావును కోరారు. తిరుపతి విద్యుత్ శాఖ కార్యాలయంలో సీఎండీతో కలిసి మాట్లాడారు. వేసవి దృష్ట్యా జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. సర్వీసు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచితంగా ప్రభుత్వం విద్యుత్ అందిస్తోందన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇటీవల అకాల వర్షాలకు పిడుగుపాటుకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 120, విద్యుత్ స్తంభాలు, తీగలు మండల కేంద్రాలకు చేరుకున్నాయన్నారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని తిరుపతి విద్యుత్ శాఖ సీఎండీకి ఆదేశించారు.

ఊరటనిచ్చిన వర్షం


పట్టణంలో భారీగా కురుస్తున్న వర్షం


కోర్టు ఆవరణలో విద్యుత్ స్తంభంపై విరిగి పడిన చెట్టు

నగరి : మండలంలో వారం రోజులుగా తీవ్ర ప్రతాపం చూపిస్తున్న ఎండ వేడిమి నుంచి గురువారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఉదయం నంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కాసినా మధ్యాహ్నం మబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న జనానికి కాసింత ఊపిరి పీల్చుకున్నారు. గాలితో పాటు కురిసిన ఈ వర్షానికి పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలపై విరిగి పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుని చెట్లను తొలగించి తెగిన విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ సరఫరా అందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


ప్రసాద్

విజయపురం (నగరి) : విజయపురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పి.ప్రసాద్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈయనను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయపురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. ఇది వరకు ఎంపీడీఓగా పని చేస్తున్న సతీష్ అనారోగ్య కారణంగా మెడికల్ లీవ్‌లో వెళ్లారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమ్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాగతం పలికారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల వచ్చే సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ ఆవరణలో 104 వైద్యాధికారి చంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌ఓ కీర్తి ప్రజలకు వైద్యసేవలు అందించారు. వైద్యం కోసం వచ్చిన వారికి డాక్టర్ మోహన్‌కృష్ణ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో అనారోగ్యం బారిన వారి కోసం 104 వాహనం ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి మందు లు అందిస్తామన్నారు. అనంతరం 46 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.